
ఈవారం కథ

# గంట లేని బడి



## కవనశర్మ

అన్నింటికి గరిటెడు పాలు సరిపోవు. ఒకానొక సందర్భంలో కడివెడు పాలు కావాల్సి రావచ్చు. కాకులగోలే నీడ్ ఆఫ్ ది అవర్ అవవచ్చు. కోకిల కూజితాలు చెవులకి సోకకపోవచ్చును. దీపావళి రోజుల్లో టపాకాయల మోతకున్న విలువ సామవేద పఠనానికి వుండదుకదా! ఈ ప్రకటనల ప్రచారాల రోజుల్లో ఏదైనా పదేపదే చెప్పి అందర్నీ ఒప్పించవచ్చు దేనికైనా! ఈ జ్ఞానం టి.వి. ముందు కూర్చున్న రాయలకి కలిగింది. అందరికీ రావిచెట్ల అవసరం వుండదు.

రాయలు వున్న ఊళ్ళో వుండలేకపోడానికి చాలా కారణాలున్నాయి. కాని జిల్లా కేంద్రానికి మకాం మార్చటానికి ఏకైక కారణం అతని భార్య. ఆమెకి మిరపకాయ బజ్జీలు చేయటంలో అసమాన ప్రజ్ఞ వుంది. దాంతో పట్నంలో బతకలేకపోమని చెప్పి ఒప్పించి పట్నం తీసుకువచ్చి ... బాంకువారి సహాయంతో బండికొని గంపంత కొప్పుతో చారెడేసి కళ్ళతో ఆ కళ్లలో కాటుకతో బజ్జీలు దాకలో వేస్తూ తీస్తూ వుంటే చూసేవాళ్లకి కనువిందుగా వుండేది. రాయలి గల్లాపెట్టె నిండేది. కాలం ఎప్పుడూ ఒకేలా వుండదు.

పెళ్ళాం సాయంతో మిరపకాయల బండీ పెట్టి వ్యాపారం మొదలుపెట్టిన రాయలు, వుంచుకొన్నదాని సాయంతో రాయల్ మిలిట్రీ భోజన ఒటేల్ నడిపే స్థాయికి ఎదిగాడు. అతనికి నిలబడినప్పుడు కనపడకపోయినా కూర్చున్నప్పుడు కనపడే చిరుబొజ్జ అమిరింది. ఓ పెద్దిల్లు వుంచుకొన్నదానికి, చిన్నిల్లు కట్టుకొన్నదానికి అమర్చాడు. అప్పుడు అతనికి సంఘంలో గౌరవం సంపాదించాలన్న కోర్కె కలిగింది. గౌరవం సంపాదించాలంటే 'కళాపోసన' అన్నా చెయ్యాల, కలాకారుడన్నా అవాల. కలాపోసనకి డబ్బు కర్సవుద్ది. అది లాభం లేదు. కలాకారుడవటానికి అతగాడు అయిదో క్లాసుని మించి చదవలేదు. ఎందుకు సదవలేదంటే ఊళ్ళో చెరువు, మామిడితోటలు సవాలచ్చ కారణాలున్నాయి. కాని అసలు కారణం అతనున్న ఊళ్ళో సరైన బడి లేదు. పట్నం కాపురం పెట్టి సదివించడానికి వాళ్ల అయ్యకి అనువుకాని పరిస్థితి. పట్నంలో పల్లెటూరిపిల్లలు సదూకోడానికి అన్నం పెట్టి, రూకలు పుచ్చుకొనే అనుకోండి, సదూసెప్పే స్కూళ్లు తన రోజుల్లో లేకపోయాయి. కనక తను అటువంటి బడిపెట్టి పల్లెటూరు పిల్లల సదువు సక్కబరుస్తాడు. అదీ దేస్సేవే. తనకి ఆవిధంగా కొంత కీర్తి, కొంత గౌరవం కలుగుతాయి. ఈ విధంగా ఆలోచించిన రాయలు స్కూలు నడిపే ప్రయత్నంలో పడ్డాడు.

స్కూలు పెట్టటానికి నిర్ణయించుకొన్న రాయలు ఆ ఊళ్ళో స్కూలు నడుపుతున్న తన చిన్ననాటి తన ఊరి స్నేహితుడి స్కూలుకి వెళ్ళాడు. అతను

ఇతను కలిసి చెరువులో ఈతలు కొట్టినవాళ్లు, ఊళ్ళో వాళ్ల మావిడికాయలను రాళ్లతో కొట్టిన వారు. అందుకని ఆ సెక్రటరీ "రారా రాయలూ" అంటూ ఆహ్వానించాడు.

రాయలు సుఖాసీనుడయ్యాక తన మనస్సులో మాట బయటపెట్టాడు.

"అటువంటి స్కూలు నడపడానికి నువ్వే సమర్థుడివి. నీ చేతికింద వంటవాళ్లు, సర్వర్సు వున్నారు. వాళ్లుంటే రెసిడెన్షియల్ స్కూళ్లు నడపడం ఎంత పని" అంటూ అతను భరోసా ఇచ్చాడు.

"సరైన మేస్టర్లుదొరకొద్దా?" అని రాయలు అనుమానం వ్యక్తం చేశాడు. అప్పుడా సెక్రెటరీ ఇల్లా బోధించాడు.

"దేశంలో నిరుద్యోగ సమస్య పేరుకొని పోయింది. నెలకి వెయ్యేసి రూపాయిలు ఖర్చుపెట్టి చదివిన బియ్యేలు, అన్నీ అమ్మేసి చదివిన ఎమ్మెసీలు డిగ్రీలుగా కలవారు దేశంలో కొల్లలు. నువ్వు నెలకి నాలుగువందలిస్తే కళ్లకద్దుకొంటూ వస్తారు. ఉద్యోగం ఇమ్మని కాళ్లుపట్టుకోడానికి వస్తారు. ఎంతకి సంతకం పెట్టమంటే అంతకి పెడ్తారు. నీకు బోలెడు ఛాయిస్. ఆడవాళ్లు కావాలంటే ఆడవాళ్లు, మగవాళ్ళే కావాలంటే మగవాళ్లు, దంపతులు కావాలంటే దంపతులు దొరుకుతారు. అదీ మన దేశం స్థితి. మన దగ్గర చేరాక మంచి పేరు సంపాదించుకొన్న మేస్టర్లు ఎక్కువ జీతాలకి పై స్కూళ్లకి పోవచ్చు. అటువంటివాళ్లే మన స్కూళ్లకి వస్తారు. ఆ టీచర్సులో ఒకరిద్దరు ఆడ కేరళ టీచర్సు వుండేలా చూసుకో. అది స్కూలుకి గ్లేమర్ పెంచుతుంది. వాళ్లకి తెల్గుగు మాట్లాడటం రాక ఇంగ్లీషు మాట్లాడ్తూ వుంటే పిల్లల తల్లిదండ్రులు వాళ్లకి ఇంగ్లీషు బాగా వచ్చునని భ్రమపడి ముచ్చటపడ్తారు. పిల్లలని స్కూళ్లకి పంపేది ఇంగ్లీషు నేర్చుకోడానికేకదా! అందుచేత ఇంగ్లీషులో మాత్రమే మాట్లాడే టీచర్లు మనకి చాలా అవసరం. ఇంక నీ స్కూలుకి డోకా వుండదు."

ఈవిధంగా స్నేహితుడు బోధించగానే రాయలు "మన స్కూల్లో సదువులు సరిగా లేకపోతే పిల్లలు మనబడి ఇడిసిపెట్టరా? అల్లా ఇడిసిపెట్టకుండా వుండాలంటే సదువులు సరిగా చెప్పే పంతుళ్లను మనం కుదుర్చుకోక్కర్లేదా? వంటవాళ్లు, సర్వర్లూ వుంటే సాలుద్దా?" అంటూ అడిగాడు.

స్నేహితుడైన ఆ సెక్రటరీ లేక సెక్రటరీ అయిన ఆ స్నేహితుడు మళ్లీ ధైర్యం చెప్పాడు. "దీనిమీద రెంటాల వెంకటేశ్వరరావు అనోకాయన రీసెర్చి చేసి తేల్చి చెప్పాడు. దాని సారాంశం ఏమిటంటే నీ స్కూల్లో చదువు బాగాలేదనుకొన్నవాళ్లువెక్కడకో పోవాలికదా! నా స్కూలుకి వస్తారు. నా స్కూలు బాగాలేదనుకొన్నవారు నీ స్కూలుకి వస్తారు. తప్పదు. కావాలంటే టి.సి.లు ఇచ్చినప్పుడు మనమే రెండోవాళ్ల స్కూలుని రికమెండ్ చేయవచ్చు. అల్లా చేస్తూ వాళ్లకి మనం ఉత్తరాలు రాసివ్వచ్చు. 'మనం పిల్ల స్కూలు వదిలిపెడ్తున్నా మనమీద కోపం లేకుండా మన బాగుకోరి మరో స్కూలుకి రికమెండేషన్ [illegible]న్నారం'టూ ఆ వెర్రోళ్లు నమ్ముతారు."

ఇది విని రాయలు "అంటే మనది సిండికేటన్నమాట" అంటూ గల్లాపెట్టి గలగలలాడించినట్టు గలగలమంటూను, కార్యశూరుడిలాగా ధైర్యంగాను నవ్వాడు.

రాయలు లేచి బయల్దేర్తుంటే మళ్లీ ఆ స్నేహితుడే "పిల్లలమీద జాలిపడి పుస్తకాలు తక్కువ మోయించేవు జాగ్రత్త. పిల్లల వీపులమీద వున్న పుస్తకాల బరువే మన స్కూలు మనుగడకి ఇన్‌ష్యూరెన్సు" అంటూ కొత్తగా కాపురం పెట్టబోతున్న ఆడపిల్లకి హితులు జాగ్రత్తలు చెప్పినట్టు జాగ్రత్తలు చెప్పాడు.

ఆ స్నేహితుడావిధంగా రాయలుకి వేలుతో దారి చూపించగా రాయలు ఆ స్నేహితుడి మండ కరిచేశాడు. అదేవిధంగా జరిగిందంటే అతి సహజంగాను స్నేహితుడికి నొప్పి తెలియకుండాను జరిగింది.

రాయల్ ప్రైమరీ స్కూల్‌ని రాయలు అట్టహాసంగా, కోలాహలంగా తెరిచాడు. స్నేహితుడి సలహా ప్రకారం ఆ స్కూల్లో ఇంగ్లీషు చెప్పడానికి ఆడ మళయాళీ టీచర్లని వేశాడు. పల్లెటూళ్లల్లో ఏజెంట్లని పెట్టుకొన్నాడు. నమ్మకమైన వంటవాళ్ళతో మెస్ తెరిచాడు. అన్ని హంగుల్తో హాస్టలు తెరిచాడు. డబ్బున్నపిల్లలకి స్కూలైపోయాక స్కూలు టీచర్లే స్కూల్లో వుండిపోయి డబ్బు పుచ్చుకొని కోచింగ్ ఇచ్చే ఏర్పాటుచేసి ప్రత్యేక శ్రద్ధ వహించినందుకు తల్లిదండ్రుల కృతజ్ఞత అటు ఎక్స్‌ట్రా సంపాదనకి వీలు కలిగించినందుకు టీచర్ల కృతజ్ఞత సంపాదించాడు. ఆ కోచింగ్ క్లాసుల్లో కొంతమంది పిల్లలు ఉచితంగా కూర్చునే ఏర్పాటుచేసి వాళ్ల కృతజ్ఞత, తను డబ్బు మనిషి కాదు అన్న పేరూ సంపాదించాడు.

యూకేజీ చదువు ఎల్‌కేజీలోను, ఒకటో క్లాసు చదువు యూకేజీలోను ప్రతి క్లాసులోను ఆ పైక్లాసు చదువు చెప్పాలని టీచర్లకి వార్నింగ్‌లిచ్చాడు. స్కూలు ముందర ఓ పెద్ద కాటా వేళ్లాడదీశాడు. దానిపక్కనే ఓ బోర్డు కూడా వేళ్లాడదీశాడు. దానిమీద ఇల్లా వ్రాయించాడు.

చదవుల బరువు వివరాలు

నర్సరీ–2 కేజీలు


ఎల్‌కేజీ–5 కేజీలు

యుకేజీ–8 కేజీలు

ఆ పైన ప్రతీ క్లాసుకు 5 కేజీలు అధికం.

షరా: పుస్తకాలు కొను తలిదండ్రులు బరువులు కౌంటర్‌వద్దనే సరిచూసుకొనవలెను.

గారెంటీ: మరే స్కూలులోనైనా చదువు ఇంతకంటే బరువుగా వుందని ఋజువు చేసినవారికి వారు కట్టిన అంత డబ్బు వాపసు చేయబడును. ఆ స్కూలుకి మారిపోవుటకు అవసరమైన టీ.సి,






రికమెండేషన్ ఉత్తరము జతపరిచి ఇవ్వబడును.

ఇట్లు
సెక్రటరీ అండ్ కరస్పాండెంట్
రాయలు

ఈ పద్ధతిలోని వ్యతకి తల్లిదండ్రులు ఎంతో ముగ్ధులవసాగారు. కేరళా మిస్సులు పిల్లలు సరిగా ఇంగ్లీషు మాట్లాడకపోయినా తెలుగు మాట్లాడినా, తెలుగులోనే తిట్టుకొన్నా పేరెంట్స్‌ను పిలిచి చివాట్లు పెట్టేవారు. రాయలు హాస్టలు పిల్లల్ని చూసుకోడానికి తల్లిదండ్రుల్ని ఒక ఆదివారాలే రానిచ్చేవాడు. నెలకోసారి ఇంటికి తీసుకువెళ్లనిచ్చేవాడు. మూడేళ్ల పిల్లల్ని ఆ విధంగా అతి జాగ్రత్తగా చూసుకొంటూ తలిదండ్రులకి వాళ్లని చూసుకోవాల్సిన బాధ్యత తగ్గించడంవల్ల, మంచి చదువు నేర్పుతువ్నట్టు వాళ్లని నమ్మించగలగటం వల్ల వాళ్ల గౌరవం పొందాడు. స్కూలుకి మంచి కీర్తి వచ్చింది.

పేరు ప్రతిష్టలేగాక టీచర్స్‌లో బాదరాబందీ లేని ప్రౌఢ కేరళా మిస్సులవల్ల కొంత సుఖాన్ని కూడా అప్పుడప్పుడు వీలైనప్పుడు పొందగలుగుతున్నాడు. ఆవిడ అవసరాలకి ఆదుకొంటూ ఆవిడ కృతజ్ఞతని కూడా సంపాదించాడు. చేస్తున్నది విద్యా వ్యాపారం కవక ఈ ప్రణయాన్ని చాలా గుట్టుగా నిర్వహించుకొంటున్నాడు.

ఇలా రాయలు స్కూలు వెలరేగిపోతుంటే రాయలుకి మాట సాయం చేసినతని స్కూలు వెలాతెలాపోసాగింది. పిల్లలు ఆ స్కూలు మంచి ఈ స్కూలుకి రాసాగారేకాని ఈ స్కూలు మంచి ఆ స్కూలుకి పోవటంలేదు.


జాలి గుండె కల రాయలు ఆ స్కూలు కూడా తన మేనేజ్‌మెంటు కిందకి తీసుకొని దాన్ని డే/ రెసిడెన్షియల్ స్కూలు కింద, తనది పూర్తి రెసిడెన్షియల్ స్కూలు కింద ప్రకటించాడు. ఆ డే స్కూలుకి తన స్నేహితుడినే ప్రిన్సిపాల్‌గా వుండమని కోరి అతని కృతజ్ఞత సంపాదించాడు. ఆవిధంగా ఆ స్నేహితుడు కేవలం దారి చూపించటానికి వేలు చూపిస్తే రాయలు అతని మండ కొరికేసి నొప్పి తెలియకుండా మందు వేసేసాడు.

వ్యాపారంలో ముఖ్య సూత్రం డైవర్సిఫికేషన్. స్కూళ్ల వ్యాపారంలో కూడా ఒకే స్కూలుండటం ఎంత తప్పో ఒకే రకం స్కూళ్ళుండడం అంతే తప్పని గ్రహించినవాడై రాయలు, ఒక హైస్కూలు, ఒక జూనియర్ కాలేజీ తన స్కూళ్ల లిస్టులో చేర్చి రాయల్ ఎడ్యుకేషన్ ఎకాడమి కింద వాటన్నిటిని తీసుకువచ్చాడు.

అందులో చివరిది జైలుసింగ్ జూనియర్ కాలేజి. ఆ రోజుల్లో జైల్‌సింగ్ ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా కాకపోయినా సిక్కులు, హిందువులు భాయి భాయి అంటూ దూరదర్శన్ ఊదరగొట్టేస్తున్న రోజులు కవక రాయలు ఆ స్కూలుకి ఆ పేరు పెట్టడం దేశ భక్తికి నిదర్శనం కిందే అందరూ పరిగణించారు. ఆఖరికి ఆంధ్రుల విద్యామంత్రులెంతమంది మారినా ఈ అభిప్రాయం మాత్రం మారలేదు.

రాయలు ఆ స్కూలుని, ఆ జూనియర్ కాలేజీని పాప్యులర్ చెయ్యటానికి ఎంతో కష్టపడ్డాడు. ముందర న్యూస్‌పేపర్లలో తమ్ముడు అన్నయ్యకు ఉత్తరాలు వ్రాసినట్టు, కొడుకు తండ్రికి వ్రాసినట్టు కనిపించే ప్రకటనలిచ్చేవాడు. ఆ తరువాత సినిమా హాళ్ళలో ఎదుటి సీట్లపై కాళ్ళు పెట్టరాదు, బీడీలు కాల్చరాదు, రాయల్ స్కూల్లోను, జైలు సింగ్ కాలేజీలోను చదవవలెను అంటూ స్లైడ్సు వచ్చేవి. ఎవరో టి.వి.లో ప్రకటన లిమ్మంటే నిజమని తను కొని వెళ్ళి వాళ్ళ రేట్లు తెలుసుకొని దిమ్మ తిరిగి పడిపోయాడు. అయితే రాయలు మందుడుగాడు మృత్పిండము వలె పడి వుండుటకు కందుకము వోలె పైకి లేచాడు.

తన ఎకాడమీ పేర్న కల్చరల్ వీక్స్ సెమినార్లు పెట్టేసి ఫైల్లో వున్న సినిమా తారల్ని, ఐ అండ్ బి మినిస్టర్లని, అదే మంత్రివర్గంలోని పెద్దవార్ని పిలవసాగాడు. ఆ విషయం టి.వి. వాళ్ళకి తెలియజేస్తూ ఓ ఇన్విటేషన్ పడేసేవాడు. వాళ్ళు చచ్చి



# కోరికలు – అవాంతరాలు

జీవితం, లోతులలో ప్రవహించి అనుభూతుల సముద్రాన్ని దాటి ఈవల తీరానికి చేరి, పరమ శాంతంగా అర్థంచేసుకోగలిగే జీవితం తెలివైనదిగా పరిగణించవచ్చు. ఏ వయస్సులో వుండే సమస్యలు ఆ వయసులో స్పర్శిస్తూ వుంటాయి.

పూర్వం నుండీ పరిశీలించినా, మానవుని మనుగడ కోరికల మీదే ఆధారపడి వుంది. ఒక విధంగా ఆలోచిస్తే కోరికలే మనిషి జీవితాన్ని ఉన్నతికి దోహదం చేసినా అధోగతికి పాల్పడినా అని అర్థమవుతుంది. ఆధ్యాత్మికంగా, సామాజికంగా, తరచి చూచినా కోరికల విలయతాండవమే అని బోధపడుతుంది. తను పుట్టిన పరిసరాల నుండే ప్రారంభించి జీవితాంతం వెంట వుండి తనతోనే పోయేవి ఈ కోరికలు. కోరికలలో బలముంటేనే తల్లిదండ్రులు బిడ్డలను ప్రేమించేది. కోరికలో బలముంటేనే విద్యను పొందేది. కోరికలో బలముంటేనే తను అనుకున్నది సాధించేది. ఈ తపన లేనిది సృష్టే లేదు. ఇది సత్యం.

కాలం పరుగులో మనసుకున్న కోరికలు కూడా పరుగులు తీయుట సహజం. సహజంగా తన కోరికలు తను పుట్టిన సామాజిక పరిస్థితులననుసరించి వుండాలి. తన ఆర్థిక పరిస్థితికి అనుకూలంగా వుండాలి. తన ఉన్నతికి దోహదమయ్యేవిగా వుండాలి. పసి చేతులతో డబ్బు విలువ తెలిసీ తెలియని మనసుతో ఆడపిల్ల చిన్ని జేబులో దాస్తుంది. అది పెరిగి పెరిగి తన అవసరాలు తనను బంధించి తన మనస్సును తల్లక్రిందులు చేసే వరకు సాగుతుంది ఈ చర్య. అలాగే సుఖ జీవితం. సంజీవదేవ్ ఒక పర్యాయం వ్రాశారు. "Live in light. It lives in deligh[illegible] [illegible]. "వెన్నెలంటే ప్రేమిస్తాను. చీకటంటే బాధపడను" అని. బాధలు కోరికల వలనే అని బుద్ధుని నిర్యాణం విశదం చేస్తుంది.

కోరిక రావడం, తీరడం తీరకపోవడంలో ప్రాధాన్యత ఇవ్వనంతవరకు జీవితం చాలా సుఖంగా వుంటుంది. కోరిక తీరక అది తీరాలనే పట్టుదల, అహంకారం, విచక్షణాజ్ఞాన లోపం వీటి వలన ఎన్నో అవాంతరాలు చుట్టుముడతాయి. మానసిక దౌర్బల్యానికి మూల కారణము కూడా కావచ్చు. జీవితావసరాలు వేరు, అత్యాశలు వేరు. తల్లిదండ్రులను సుఖపెట్టి, తను సుఖపడి, భర్తను సుఖపెట్టి బిడ్డలను తీర్చిదిద్దే తల్లి భారతదేశానికి గౌరవప్రదమైన చిహ్నం. ఒకరిని చూసి ఒకరు పోల్చుకునే గుణం ఎక్కువ ఆడవారిలోనే విశదంగా తెలుస్తుంది. స్త్రీ జీవితం అతి మధురమైనది. ఈ మధ్య ఆడపిల్ల పుడితే అబార్షన్ అన్న వార్తలు వింటే ఎంతో హృదయవిదారకంగా వుంటుంది. తల్లిదండ్రులకుండే కోరికలే ఈ సమాజ ద్రోహానికి కారణం. వివాహమే ప్రాధాన్యమన్నట్టు ఆడపిల్లను తీర్చిదిద్ది ఆ పిల్లకు న్యాయం కూర్చలేక సతమతమయ్యే పరిస్థితులనే చూస్తున్నాము. తన ఉనికిని గుర్తించి, మంచి పనులను సాధించి, సాహసంగా ముందుకు పోయేవారికి వివాహం అంత ప్రాధాన్యత కాదనిపిస్తుంది. వివాహం చేయలేక తల్లిదండ్రుల ఆత్మహత్యలు, కాలేదని పిల్లల ఆత్మహత్యలు ఎక్కువైన ఈ రోజులలో కోరికల తీవ్రతే కనిపిస్తోంది. గృహిణి తన ఆర్థిక స్తోమత, తన వ్యక్తిత్వం పిల్లల మీద ప్రయోగించకుండా పరుగులు తీసే ఆధునిక నాగరికత వైపరీత్యాలకు బలికాకుండా చూడవలసిన బాధ్యత వున్నది.

ప్రశాంతమైన మనస్సు మానవత్వాన్ని పెంచే కోరికలనే కోరుకుంటుంది. ఏ అవాంతరాలు రాకుండా కాపాడతాయి.

– చలసాని వసుమతి

నట్టు పరిగెత్తుకు వచ్చి తరువాత వారి ఏదో ఒక కార్యక్రమంలో బోలెడంత కవరేజిచ్చేవారు. కెమెరా మంత్రుల ముఖాల్ని, అధికారుల ముఖాల్ని పట్టుకువేళ్ళాడ్తుందన్న విషయం తెలిసినవాడు కనుక వాళ్ళ వెత్తిన రాయల్ ఎడ్యుకేషన్ ఎకాడమీ అన్న తల పాగాలు పెట్టేవాడు. వాళ్ళ మెళ్ళో వేసిన దండల్లో కూడా ఆ అక్షరాలు వచ్చేటట్టు జాగ్రత్తపడేవాడు. మెమెంటో కింద తన స్కూలు బిల్డింగ్స్ మోడల్స్ ఇచ్చేవాడు.

అంత హడావిడిగా స్కూళ్లూ, కాలేజీ పాప్యులర్ అయిపోతుంటే ఓ మంత్రిగారు "మీ బళ్ళో గంట లేదేమి?" అని అడిగాడు. దానికి బడి వార్డెన్‌గా వున్న సింగ్ జవాబు చెప్పాడు.

"నేనీ కాలేజీకి రాక ముందు జైల్లో వార్డనుగా వుండేవాడిని. ఖైదీలని గొప్ప డిసిప్లిన్‌లో వుంచేవాడిని. అందుకని నన్ను అందరూ మెచ్చుకొని వార్డర్ అంటే సింగే వార్డరు... అంటూ పొగిడేవారు. నా గొప్పతనం విని రాయలు తను పెట్టబోతున్న జూనియర్ రెసిడెన్షియల్ కాలేజీ హాస్టలుకి వార్డెన్‌గా రమ్మని కోరాడు. ఇన్ని జైళ్ళు నిర్వహించిన వాడిని నాకదో లెక్కా. వెంటనే వాలంటరీ రిటైర్మెంటు తీసుకొని రాయలు దగ్గర కుదిరిపోయాను. జైలు పద్ధతులు ఇక్కడ బాగా నప్పతాయి. స్టూడెంట్స్ లేవటానికి, టాయిలెట్‌కి వెళ్ళటానికి కొద్దికాలం కేటాయించి అవుట్ బెల్, ఇన్‌బెల్ కొట్టించవచ్చు. అలాగే మధ్యాహ్నం భోజనానికి, ఖైదీలు సాయంత్రాలు చెట్ల కింద నీళ్ళు పోస్తే వీళ్లు సాయంత్రాలు చెట్ల కింద చదువుకుంటారు. అల్లా నాకెన్నో పోలికలు కనిపించాయి. ఆ తరువాత రాయలు ఆ కాలేజీని ఈ జైలు పక్కనే వున్న స్థలంలో పెడ్తానన్నప్పుడు మళ్ళీ వేరే గంటెందుకు జైల్లో కొడ్తూ వుంటారు కదా. బెల్లు కొట్టే వాడి జీతం ఆదా చెయ్యవచ్చునని చెప్పాను. రాయలుకి నా సలహా నచ్చి గంట లేకుండా జూనియర్ కాలేజీ పెట్టి దానికి నా పేరు, దేశభక్తి కలసి వచ్చేటట్టుగా పేరుపెట్టాడు. అంతేగాని నిజానికి నేనంత గొప్పవాణ్ణి కాదు" అని జైలు నుంచి వచ్చిన సింగ్ చెప్పి మంత్రివర్యుడి ముఖంలోని ఆశ్చర్యాన్ని మెప్పుగా భావించి

"ఇంకో విషయం కూడా మనవి చేయాలి. హాస్టలన్నాక సర్‌ప్రైజ్ చెక్కులుండాలి. అప్పుడే డిసిప్లిన్ బ్బావుంటుంది కదా సార్! అందుకని దానికో పద్ధతి కనిపెట్టాము. జైల్లో ఎవరైనా దొంగ లేక దొంగలు పారిపోతే లేకపారిపోదామనుకుంటే ఊరుకుంటారా? సైరన్లు మోగుతాయి. కుక్కలు మొరుగుతాయి కదా! అప్పుడు రెసిడెన్షియల్ దంపతుల నిద్రా, నా నిద్రా ఎల్లాగో పాడవుతాయి. అందుకని ఆ సమయంలోనే మేమూ మా స్టూడెంట్స్ అందరూ హాస్టల్లో వున్నారో లేక సినిమాలకి గట్లా చెక్కేసారో చెక్ చేస్తాం" అని కూడా చెప్పాడు. మంత్రిగారి ఆశ్చర్యం మహాశ్చర్యంగా మారటం చూసి–

"సరిగా జైలు పద్ధతుల్నే సింగు గారు పాటించడం వల్ల మా స్కూలు కింత పేరొచ్చింది. కాని స్కూలు పేరు మాత్రం పాత రాష్ట్రపతిదే" అని రాయలు వినయంగా చెప్పాడు.

ఇదంతా వివరంగా దూరదర్శన్ వారు చూపించారు. ●